# సుధ

ఆ వేసవి కాలపు ఉషస్సు చాలా ఆహ్లాదకరంగా ఉంది. మామిడిచెట్ల గుంపుల్లో కోకిలలు పోటీలుపడి కూస్తున్నాయి. తూర్పు ఆకాశం అరుణారుణ కాంతులతో సూర్యునికి స్వాగతం పలుకుతోంది. చల్లని పిల్ల తెమ్మెరలు శరీరానికి చక్కలిగింతలు పెడ్తున్నాయి.

సుధ మళ్ళీ ఒకసారి మత్తుగా ఆవలించింది. ఇక నిద్రమత్తు వదిలినట్లే అనుకొంది. ఆ ఉదయపు ప్రశాంత వాతావరణం ఆమె మనస్సును ఏవేవో తియ్యని ఊహలతో నింపుతున్నది. ఉయ్యాల ఊపు తున్నట్లుగ కచ్చరం బండి ఊపు, జోలపాటలాగా ఎద్దుల మెడల్లోని గజ్జెల సంగీతం, అప్పుడే నిద్రనుండి మెలకువలోకి వచ్చిన సుధను నిద్రాకాని, మెలకువాకాని ఒక స్వప్నావస్థలోకి తీసుకుపోతున్నాయి. మధుర స్మృతుల చిత్తరువులు ఆమె భావనా జగత్తులో తమ రూపాల్ని చూపించుకొంటున్నాయి.

"వెళ్తావా సుధా! నిన్ను విడిచి ఎలా బ్రతకను... నీ కన్నుల్లోకి తప్ప చూడలేని నా కన్నులకి ఏం పని చెప్పి వెడ్తావు. నీ వడిలో తప్ప నిద్రపోలేని నన్ను ఎవరికప్పగించి వెడ్తావు..." ఆయనలా బాధగా అంటుంటే తన హృదయం ఏదో వెర్రి ఆనందంతో నిండిపోయింది... ఎప్పుడూ అలా ఆయన మాటలు వింటూ ఆయన కళ్ళల్లోకి చూస్తూ ఆయన హృదయానికి హత్తుకుపోవాలనిపిస్తుంది. నిజంగా తనను విడిచి ఈ నాలుగు రోజులు ఎలా ఉంటారో? పసివాడి కంటే అన్యాయం... ఎప్పుడూ యేదో చెప్తూనే ఉంటారు. ఆ కళ్ళు ఎప్పుడూ చిలిపిగా నవ్వుతూనే వుంటాయి... యేదో చిలిపిమాట అనేయటానికి ఆ గులాబి రెక్కల్లాంటి పెదవులు ఎప్పుడూ తయారుగా ఉంటాయ్... ఆ చేతులు ఎప్పుడూ ఏదో అల్లరిపని చేస్తూనే వుంటాయి.

"ఎంత దయలేనిదానివి సుధా! నీకోసం నాలుగు గంటలనుంచి క్షణమొక యుగంగా ఎదురు చూస్తున్నా..."

"అబ్బ! నాల్గు గంటలు కాదు కదా నాల్గు నిమిషాలు కూడా కాలేదు నేను మీ దగ్గర నుంచి వెళ్ళి... ఎప్పుడూ మీ దగ్గరే కూర్చుంటే అత్తయ్య యేమనుకుంటుంది చెప్పండి?"

"ఏమీ అనుకోదు. నా కొడుకూ కోడలు చిలకా గోరింకల్లాగ హాయిగా కాపురం చేస్తున్నారని మురిసిపోతుంది. ఇప్పటి నుంచి నువ్వు నన్ను విడిచి ఒక్కక్షణం కూడా ఉండటానికి వీలు లేదు"

"ఎలాగండీ మీతో? ఇంటి పనంతా అత్తయ్య మీదే పడేసి మీతో ఇరవై నాల్గు గంటలూ ఉండిపోనా? ఎవరైనా చూస్తే ఏమనుకుంటారు... కోడలొచ్చినా అత్తకు సుఖం లేదని నన్ననరా...?"

"ఔను... అంటారు... ఈ ప్రపంచమంటే అంతే సుధా! ఎవరి లోకంలో వాళ్ళను వుండనీయరు. మనం వీళ్ళ మధ్య బ్రతకలేం. మనం ఇక్కడ నుంచి వెళ్ళిపోదాం. ఒక క్రొత్త ప్రపంచంలోకి... అక్కడ నువ్వూ నేను తప్ప మరెవరూ ఉండరు"

అంతే... అలా ఆయన కలల్లోకి వెళ్ళిపోతారు.

"హడీ హడీ!" అంటూ కొమురడు బండి తోలుతున్నాడు. ఒక లయలో గజ్జెలు మ్రోగుతోంటే ఎడ్లు పరుగెడుతున్నాయి.

"ఎంత దూరం వచ్చామురా కొమురా?" అడిగింది సుధ.

"ఎక్కడమ్మా... కోసెడు దూరమన్నా దాటలే... పొద్దుగాల యెల్లిపోవాలె. యిగ కాసేపయితే కొరకాసు పెట్టినట్టు యెండ. అగో పొద్దుగూడ పొడుస్తాంది. మనూరు దగ్గరున్నదా! బువ్వాళ్ళొరకన్నా పోతమో పోమో"

సుధ మళ్ళీ తనలోకంలోకెళ్ళిపోయింది. వస్తున్నప్పుడు ఆయనెంత అల్లరి చేసారు.

"ఈ ఆడవాళ్ళకి తల్లిగారిల్లు లేకపోతే బావుండేది. మాటిమాటికి యిలా బండి తోలించి మా ప్రాణాలు తీసేవాళ్ళు కాదు. ఇప్పుడు వెళ్ళకపోతే ఏం సుధా! నువ్వొచ్చి నాల్గు రోజులు కూడా కాలేదు"

తనకి నవ్వొచ్చింది. తనొచ్చి అప్పటికి రెండు నెలలయ్యింది. ఉగాది కూడా అక్కడే గడిపింది. నాల్గురోజులన్నా కాలేదు ఆయనకు.

మిమ్మల్ని నాన్న కూడా రమ్మన్నారట. వస్తేయేం – నాల్గు రోజులుండి మళ్ళా కలిసే వద్దాం"

"అమ్మో! ఆ వూరికే? ఒక్క క్షణం కూడా తోచదు. తమరేమో ఎక్కడో స్నేహితురాళ్ళతో, వదినలతో ముచ్చట్లు పెట్టూ నన్ను మరచిపోతారు... దానికితోడు మీ ఊరికొస్తే మీ అన్నగార్లతో వేగలేను. ఆయనింటికి వెడితే ఈయనికి కోపం, ఈయనింటికి వెడితే ఆయనికి కోపం. వాళ్ళు పోటీలుపడి చూపించే ఆ ప్రేమను భరించలేను. వాళ్ళు కుండల కొద్దీ తాగింది చాలక నన్నుకూడా కల్లు తాగమని వాళ్ళుచేసే ఆ బలవంతం జ్ఞాపకం చేసుకుంటే భయమేస్తుంది"

ఔను... ఆయప్పుడు వచ్చినా రెండు మూడు రోజులకంటే ఎక్కువ ఉండలేరు. పెద్దన్నకూ, చిన్నన్నకూ ఎప్పుడూ ఏదో పోట్లాట ఉంటూనే ఉంటుంది. ఇద్దరూ చాలా

మూర్ఖంగా ప్రవర్తిస్తారు. ఎవరూ అంతగా చదువుకోలేదు. కనీసం ఆయనతో సరిగా మాట్లాడటం కూడా తెలియదు. అయినా వాళ్ళకు తనంటే ఎంత ప్రేమ! తను వారికి ఒక్కగానొక్క చెల్లెలు... అందుకే తనంటే ప్రాణాలిస్తారు... వాళ్ళిద్దరూ కలిసి ఉండాలని తను ఎదురైన దేముడికల్లా మ్రొక్కుకుంటుంది. కాని వాళ్ళ శతృత్వం రోజురోజుకూ పెరుగుతున్నదే కాని తరగడం లేదు. ఆయనెప్పుడు ఆ వూరొచ్చినా యిద్దరు ఏదోవిధంగా వారిని బాధిస్తూనే ఉంటారు. అందుకే వస్తోంటే అన్నారు "నువ్వైనా ఎందుకు వెళ్ళటం సుధా! మీ అన్నల విషయం ఏదో కల్పించుకోబోతావు. వాళ్ళు నీ మాట పట్టించుకోరు... నువ్వు బాధపడ్తావు... ఎందుకు చెప్పు మనకిదంతా..."

"కాదండి... ఇక నుండి ఎప్పుడూ అన్నయ్యల విషయంలో జోక్యం చేసుకో దలచుకోలేదు. నాన్న అంతగా రమ్మన్నారు. ఈ వయస్సులో వారికి మనశ్శాంతి అనేది ఎప్పుడూ ఉండక ఎంతో క్రుంగిపోతున్నారు. ముఖ్యంగా అన్నయ్యల పోట్లాట... నన్ను చూసైనా నాల్గురోజులు అన్నీ మరచిపోగల్గుతాడేమో... ఓ పది రోజులుండి వచ్చేస్తాను. మిమ్మల్ని విడిచి నేనుమాత్రం బ్రతకగలనా?"

"అమ్మో! పదిరోజులే... 240 గంటలన్నమాట. నిన్ను విడిచి అన్ని గంటలు... బ్రతకగలనా?"

"మీరు మరీ యిదండి"

"యేదండీ?" తన పెదవులమీద మృదువుగా ఆయన పెదవులు.

"అబ్బ! యెలాగండి మీతో?"

"ఇలాగండి" ఆయన తనచేతుల్లోకి తీసుకున్నారు. పసిపాపలా ఆయనమీద ఒరిగిపోయింది... ఆయన గుండెల చప్పుడు వింటూ అలా ఆయన హృదయం మీద ఎంతసేపుందో...

"సుధా! ఎప్పుడూ ఇలాగే ఉండిపోవాలనిపించడం లేదూ? ఇలాగే శిలలమైపోతే ఈ కౌగిలిని శాశ్వతం చేసుకోగల్గేవాళ్ళం కదూ?"

యేదో పారవశ్యంతో వింటోంది. తనను తాను మరచిపోయింది. తనులేదు. తనను సర్వస్వమూ కొల్లకొట్టుకున్నారు. ఔను... ఆయన అన్నట్లు ఎప్పుడూ అలాగే ఉండిపోగల్గితే! అలా ఎంతసేపున్నారో.

"సుధా!" అని నెమ్మదిగా పిలుస్తున్నారు తననెవరో... ఏ లోకంలోంచో పిలుస్తున్నట్లుగా సన్నగా, తియ్యగా వినిపిస్తోంది. వారి కౌగిలిలో మత్తుగా కళ్ళు తెరచింది. కలలోంచి నిజంలోకి వచ్చిందో, నిజంలోంచి కలలోకి వచ్చిందో తెలియని ఒక మధురాతి మధురమైన క్షణమది.

"అమ్మ పిలుస్తోంది. మీరువెళ్ళే టైమైనట్లుంది... లే సుధా!" అంటున్నారు. అత్తయ్య పిలుపు... "లేచి అన్ని సర్దుకో... పొద్దుగాలే పోతే మంచిది. తెల్లారితే నిప్పులు కురిసే ఎండ"

"అలాగే అత్తయ్యా" అంది. నిద్రమబ్బు వదలడం లేదు. వారి కౌగిలి విడిచి వెళ్ళాలనిపించడం లేదు.

"నిజంగా వెళ్తున్నావా సుధా?" తన వెంట్రుకల్ని సరిచేస్తూ ఆయన. తనకి నిజంగా వెళ్ళాలనిపించడం లేదు. ఆ క్షణంలో ఆయనతో అలా ఉండడం కోసం ప్రపంచంలో దేనినైనా వదులుకోవాలనిపిస్తోంది.

"ఖాళీబండి పంపించేద్దాం. వెళ్ళను" అంటూ వారి గుండెలకు హత్తుకు పోయింది. కాస్సేపు అలా వుండిపోయారు.

"వద్దు సుధా! నువ్వొచ్చి రెండు నెలలు దాటింది. ఇప్పుడు కూడా వెళ్ళకపోతే మీ నాన్న చాలా బాధపడ్తారు. మీ నాన్నకోసం నువ్వు తప్పకుండా వెళ్ళాలి. ఈ వృద్ధాప్యంలో ఆయనకు నువ్వుతప్ప ఎవరున్నారు? మీ అమ్మ చనిపోయినప్పటినుంచి నిన్ను చూసుకునే బ్రతుకుతున్నాడట... మా అమ్మ చాలాసార్లు చెప్పింది. నీకు చిన్నప్పటి నుంచి తల్లీతండ్రీ ఆయనేనట. నిన్ను విడిచి ఎలా ఉండగలుగుతున్నాడో...."

ఆయన అలా మాట్లాడుతోంటే ఆనందంతో తన హృదయం పగిలిపోతుందా? అనిపిస్తుంది. నాన్న మీదున్న వారి ఆ సానుభూతి చూస్తే తన హృదయం పరవశించి పోతుంది. తను వారికి ఎంత కావలసినా నాన్నకు తనమీది ప్రేమను అర్థం చేసుకునే హృదయం వారికుండటం తను ఏ జన్మలోనో చేసుకున్న పుణ్యఫలమనిపిస్తుంది. అప్పగింతల సమయంలో తనను వారి చేతుల్లో పెడ్తూ కళ్ళనీళ్ళు తుడుచుకుంటున్న నాన్నని చూస్తే ఆయనకి కూడా దుఃఖమొచ్చిందట... ఎంతో కష్టంగా ఉబికివస్తున్న కన్నీళ్ళను ఆపుకున్నారట...

"అప్పుడు మీ నాన్నని చూస్తే శకుంతలను అత్తవారింటికి పంపిస్తున్న కణ్వమహర్షి జ్ఞాపకం వచ్చాడు సుధా!" అని చెప్పారు తర్వాత ఒక రాత్రి అలా శకుంతల కథంతా చెప్పారు. ఆయన కథలు ఎంత చక్కగా చెప్తారు. తనంతగా చదువుకోలేదు. యేవో పత్రికల్లో వచ్చే కథలు చదివి అర్థం చేసుకోగలదు. కాని వారు చెప్పే కథలు అలాగుండవు. అలా ఆయన చెప్పేస్తుంటే గంటలకి గంటలు హాయిగా గడుస్తాయ్... శకుంతల కథ ఎన్నిసార్లు వినలేదు. కాని వారు చెప్తోంటే అప్పుడే కొత్తగా విన్నట్టుగా వింటుంది. నాన్నని చూస్తే ఆయనకు శకుంతల తండ్రి కణ్వుడు

జ్ఞాపకం వస్తాడట... తను వెళ్తున్నానంటే అంత అల్లరిచేసిన వారే చివరకు "వెళ్ళు సుధా! నువ్వు వెళ్ళకపోతే మీ నాన్న చాలా బాధపడ్తారు" అన్నారు. అత్తయ్య మళ్ళీ ఒకసారి తొందరపెట్టింది. మత్తుగా, అయిష్టంగా, భారంగా పక్కమీది నుంచి లేస్తోంటే "కొన్నాళ్ళదాకా ఇదే ఆఖరు కౌగిలి... యివే ఆఖరు ముద్దులు" అంటూ వారు ఉక్కిరిబిక్కిరి చేసారు.

త్వరగా సర్దుకొంది. బండి ఎక్కడానికి క్షణాల్లో సిద్ధమైంది...

"జాగ్రత్తగా వెళ్ళమ్మా... వెళ్ళడంతోటే క్షేమంగా చేరింది, నాన్నగారి ఆరోగ్యం తెలుపుతూ ఉత్తరం రాయి. అందర్నీ అడిగానని చెప్పు" అంటున్న అత్తగార్కి మామగార్కి మ్రొక్కి బండెక్కింది. తనను అత్తామామ కూడా ఎంతో ప్రేమగా వారి కన్నకూతురులా చూసుకుంటారు. అంతా తన అదృష్టం.

"ముందట బాట బాగలేదు. పెద్ద కయ్య వస్తాంది. మంచిగ కూసోండమ్మా" అన్న కొమురని మాటతో ఈ లోకంలోకి వచ్చింది సుధ. ఇంతసేపు తను బండిలో ప్రయాణం చేస్తున్నానన్న సంగతే మరచిపోయింది.

"ఎంతదూరం వచ్చాంరా" అడిగింది.

"ఆమడదూరం దాటినం... అప్పుడే అంబటాళ్ళయింది. బువ్వాళ్ళొరకన్న చేరబోతం లేండ్రి" అన్నాడు కొమురయ్య. కొమురయ్య సుధవాళ్ళ నాన్నదగ్గర చాలాకాలం నుండి జీతగాడిగా పనిచేస్తూ వాళ్ళ కుటుంబంలో సభ్యుడిగానే మారిపోయాడు.

కాస్సేపు కొమురయ్యతో ముచ్చటించాలనిపించింది.

"సరేగాని కొమురా, ఊళ్ళో అంతా నిమ్మళంగా ఉన్నార్రా?"

"ఎక్కడిదమ్మా... మనూరంత పాడూరు దేశంలో లేదు... యెప్పటికీ యేదన్న లొల్లి ఉండనే ఉంటది"

"మళ్ళీ యిప్పుడేం లొల్లిరా?..."

"యేదో ఓట్లటమ్మా... ఓట్లట... పంచాయితి బోర్డట... దానికి నెంబర్లను యెన్నుకోవాల్నట. ఊళ్ళో జనం అంతా రెండు గ్రూపులు గట్టింగ్రు... ఆరికి ఈరు, ఈరికి ఆళ్ళు ఎప్పుడు పుల్లలు పెట్టుకోడం... తన్నుకోటం"

"ఔను, ఈమధ్య యిదోటి వచ్చింది. పోనీగాని మా అన్నల పంచాయతీ లెట్లున్నయి"

"ఇప్పుడసలే పడతలేదమ్మా. యిద్దరు చెరో గ్రూపులో చేరింగ్రు. వాళ్ళ కొట్లాట రోజురోజుకు ముదురుతాంది"

తను అనుకుంటూనే ఉంది యిట్లాంటిదేదో జరుగుతుందని. ఆయన యెప్పుడూ అంటుంటారు "మీ అన్నలు ఈ జన్మలో అన్నదమ్ముల్లాగా కలిసి ఉండలేరని". అయినా తనేం చేయగలదు? తను వాళ్ళిద్దరూ కలిసి ఉండాలని యెన్నిసార్లు ప్రయత్నించినా ఫలితమేమైనా ఉందా? యిద్దరితో ఎన్నిసార్లు వాదించింది, ప్రార్థించింది. "ఈ విషయాలతో నీకేం పనే... నీకేం తెలుసని అట్లా మాట్లాడుతావు" అంటారు యిద్దరూను. నాన్నకు ఎప్పుడూ అదో పెద్ద రంధి. ఇద్దరూ ఆయన మాటను ఏమాత్రం కూడా లక్ష్యపెట్టరు. వారితో వేగలేక ఆస్తి పంపకాలు చేసి యిద్దరికి పంచి తను వేరే ఉంటున్నాడు. ఇద్దరన్నల యిండ్లు పక్క పక్కల్లోనే. అందుకే ఏదో నిప్పు ఎప్పుడూ రాజుకుంటూనే ఉంటుంది. ఇద్దరిండ్లూ కాస్త దూరంగా ఉన్నా బావుండేవి. తనమీద ఆ వదినలకు కూడా ఎంతో ప్రేమ. వాళ్ళు కూడా తమ భర్తలు కలిసి ఉండాలని ఎన్నో దేవుళ్ళకు మొక్కుకుంటారు.

అప్పుడే ఎండ తీవ్రత అధికమైంది. కొమురయ్య ఉత్సాహంగా బండి తోలుతున్నాడు. నురుగులు గ్రక్కుకుంటూ యెద్దు పరిగెత్తుతున్నాయి.

సుధ మళ్ళీ కలల్లోకి వెళ్ళిపోయింది. వస్తున్నప్పుడు వారు రెండు మూడుసార్లు హెచ్చరించారు. "మీ అన్నయ్యల విషయంలో జోక్యం చేసుకోకు. వారేమన్న కరుకుగా మాట్లాడితే నీవు బాధపడ్తావు..." తను బాధపడకూడదు. తనకు యేమాత్రం కష్టం కలిగినా ఆయన తల్లడిల్లిపోతారు. తననో మల్లెపువ్వులా చూసుకుంటారు... పువ్వుల్లోపెట్టి పూజించాలనుకుంటారు. తను యెప్పుడూ ఏదోపని చేస్తుందని వాళ్ళమ్మతో "ఒక పనిమినిషిని పెట్టుకుంటే యేంపోయిందీ" అంటుంటారు. "మనకున్న ఈ బ్రహ్మాండమైన పనికి పనిమనిషెందుకురా. దానికో కుంచెడో కుండెడో దండగ" అంటుంది వాళ్ళమ్మ. "ఛీ! నువ్వెప్పుడూ యింతేనే" అని విసుక్కుంటారు... తనకోసారి కొద్దిగా జ్వరమొచ్చింది... అబ్బ! ఎంత హడలిపోయారు... ఆ నాల్గురోజులు తనను ఒక్క క్షణమైనా విడిస్తేనా? ఎవరైనా చూస్తే యేమనుకుంటారని కూడా...

బండి యేదో రాయి యెక్కినట్లుంది. బాగా యెత్తేసింది. అజాగ్రత్తగా కూచున్న సుధకు నడుముకు బాగా దెబ్బతాకింది. 'అమ్మా' అంది బాధగా.

"దార్లోనే ఎవ్వడో రాయి పడేసిండమ్మా... చూల్లేదు... దెబ్బ తాకినట్లుంది" అన్నాడు కొమురయ్య.

"కళ్ళు పెళ్ళికిపోయినయా... ఎటు చూస్తున్నవు. రాయుంటే కాస్త తిప్పి పోనీయొద్దు... అబ్బ! నా నడుం విరిగింది" అంది సుధ కోపంగా.

"తప్పయిందమ్మగారు" అన్నాడు కొమురయ్య బోల్డు బాధపడిపోతూ.

సూర్యుడు నిప్పులు కురిపిస్తున్నాడు. వడగాడ్పు వీచడం కూడా మొదలెట్టింది. ప్రయాణం విసిగించడం మొదలెట్టింది.

"ఇంకా మనూరు ఎంతదూరం ఉందిరా ?" అడిగింది సుధ.

"ఇంక రెండు కోసులుందమ్మ... చాలాదూరం దాటినం... అగో దూరంగా ఆ తాళ్ళు కనబడతలేవు... అయిదాటితే మనూరేనాయె"

తన ఊరు దగ్గరౌతుందంటే సుధ మనస్సంతా తన ఊరుమీదకు మరలింది. తను పుట్టి పెరిగిన ఊరు... ఆ ఊర్లోనే తను బొమ్మల పెళ్ళిళ్ళు చేసింది. ఆ వూర్లోనే తనకు తెలియని పసితనంలో తన అమ్మను ఎటో తీసికెడుతోంటే గుండెలు పగిలేట్లు యేడ్చింది. ఆ వూర్లోనే "పూర్వం దశరథుడను రాజు అయోధ్యను పాలించుచుండెను" అని చదువుకుంది. ఆ వూర్లోనే తన తండ్రి కన్నులకు కాంతిగా, అతని జీవితానికి పరమార్థంగా పెరిగింది. ఆ ఊరిలోని ప్రతి ప్రాణికీ తనకూ ఒక మధురాతి మధురమైన అనుబంధం తన రక్తంలో జీర్ణించుకుపోయింది. ఇప్పుడు ఆయన సన్నిధిలో ఆ ఊరును కొంతకాలం మరిచిపోగలుగుతోంది. కాని ఇప్పుడా ఊరికి వెళ్తున్నానన్న భావన ఆమె హృదయాన్ని వెర్రి ఆనందంతో ముంచివేస్తోంది.

ఊరు దగ్గరౌతున్నకొద్దీ సుధకు ఆ వూరిలో కావలసిన వాళ్ళంతా ఒక్కొక్కరే జ్ఞాపకం వస్తున్నారు. వాళ్ళంతా ఎలా ఉన్నారో? బాల్యంలో తనను ఎప్పుడూ వీడని స్నేహితురాండ్రు... యెప్పుడూ యేదో అమాయక లోకంలో విహరించే తన సహచరులు. వాళ్ళని గూర్చి కొమరయ్యను అడగాలనిపించింది.

"ఆ కమలమ్మ బావున్నాదిరా?"

"యే కమలమ్మమ్మా?"

"అదే... కోమటోళ్ళ కమలమ్మ"

"కొమటోళ్ళ కమలమ్మా... యేం బాగమ్మా... ఆ అత్తోరు యింకా తీసుకపోతలేరటగా"

అయితే యింకా వాళ్ళ గొడవ అలాగే ఉందన్నమాట. కమల తనకు చాలా దగ్గర స్నేహితురాలు. చిన్ననాడెన్నడో తనకు తెలియని కాలంలో దానికి పెళ్ళి అయిందట. ఆ మొగడికేం రోగమో దీన్ని నానా హింసలు పెడ్తాడట – అవి భరించలేక యిప్పుడు తల్లిగారింటి దగ్గరే ఉంటోంది. పాపం కమల... ఎంత విచారంలో కూడా ఎప్పుడూ నవ్విస్తుంది. నవ్వుతుంటుంది. ఎప్పుడోగాని తన విషాదగాథను చెప్పుకోదు. "నీకేం సుధా! నువ్వు అదృష్టవంతురాలివి" అంటుంది తనను. దాని జీవితం ఎప్పుడైనా బాగుపడ్తుందో – లేదో?"

తర్వాత ప్రమీల జ్ఞాపకం వచ్చింది. దాన్ని జ్ఞాపకం చేసుకుంటే నవ్వొస్తుంది.

"ఆ కాపోళ్ళ ప్రమీల ఎలా ఉందిరా?"

కొమరయ్య కూడా నవ్వాడు. "ఆ అత్తకూ కోడలుకూ ఎప్పటికీ యేదన్న కీచులాట ఉంటదమ్మా"

ఔను. ప్రమీల తన అత్తను గురించి నానా కథలు చెప్తూ నవ్విస్తుండేది. "మా అత్తంటే యేంటనుకున్నారు. రాక్షసి - అచ్చు సినిమాలో సూర్యకాంతమే అనుకో" అంటూంటే అంతా విరగబడి నవ్వేవాళ్ళు. వాళ్ళ అత్త రాక్షసి అయితే ఇది బ్రహ్మరాక్షసి. యెప్పుడూ ఆ అత్తకు దగ్గ పనేదో చేస్తూనే ఉంటుంది.

"మీ అత్త యెలాంటిదే" అని అడుగుతుంది తనను.

"మా అత్త చాలా మంచిది" అంటుంది తను.

"పెట్టిపుట్టావే" అంటుంది ప్రమీల.

ఆ తర్వాత రాధ జ్ఞాపకం వచ్చింది.

"ఆ బాపనోరి రాధమ్మ బావున్నాదిరా?" అడిగింది.

"ఆ తల్లా? బాగానే ఉందమ్మా"

రాధ... రాధను జ్ఞాపకం చేసుకుంటే కన్నులు చెమ్మగిల్లుతాయి. చాలా రోజుల దాకా రాధ జీవితానికి యేలోటు లేదు. కాని అకస్మాత్తుగా రాధ భర్త చనిపోయాడు. అంతే! రాధ జీవితంలో నిప్పులుపోసి పోయాడు. రాధ ముఖంమీది చిరునవ్వు చెరిగిపోయింది. కళాకాంతులు నాశనమయ్యాయి. జీవితం రాధను యింత ఘోరంగా ఎందుకు మోసగించిందో తల బ్రద్దలు జేసుకున్నా అర్థం కాదు. తనంటే రాధకు ఎంతో ప్రేమ. ఎంతో ఆత్మీయతతో మాట్లాడుతుంది. రాధతో మాట్లాడుతుంటే గంటలకి గంటలు యిట్టే గడిచిపోయేవి.

"అదృష్టవంతురాలివి సుధా! మీవారి సేవలో మమ్మల్ని పూర్తిగా మరచిపోయావా? ఎప్పుడైనా జ్ఞాపకం చేసుకుంటావా?" అనేది. ఓరాత్రి వీళ్ళందర్నీ గూర్చి ఆయనతో చెప్పింది. ఎంతో శ్రద్ధగా విన్నారు. "ఔను సుధా! ఈ దేశంలో స్త్రీల జీవితాలు యిలాగే ఉంటాయి" అన్నారు.

ఇలాగే స్నేహితురాండ్లను గూర్చి ఆలోచిస్తోంటే సుధకు తన వదినలు జ్ఞాపకం వచ్చారు. ఇద్దరొదినలకు తనంటే ఇష్టమే. చిన్నొదినది బస్తీ. ఆ గర్వం కాస్త చూపించుకో బోతుంది. డిటెక్టివ్ నవలలు, వెండితెర నవలలు చదువుతుంటుంది. "ఓహో బస్తీ దొరసానీ!" అంటూ తనామెను నవ్వుపట్టిస్తుంది. చిన్నన్న తాగుతాడని, పెద్దబావతో ఎప్పుడూ ఏదో కయ్యం వుంటుందని ఆమెకు కాస్త రంధి. తనతో గంటలకి గంటలు

మాట్లాడుతుంది. మనస్సు చాలా మంచిది. "నీకేం సుధా! నీకిట్లాంటి చిక్కులేమి లేవు. అదృష్టవంతురాలవు" అంటుంది తనను.

పెద్దాదిన తరహాయే వేరు. ఆమె తల్లిగారు బాగా డబ్బున్నవాళ్ళట. ఆమెలో ఆ గర్వం కన్పిస్తుంది. కాని తనంటే బాగానే చూస్తుంది. "మా సుధ చాలా అదృష్టవంతురాలు" అంటుంది. తనను అందరిలాగే "తల్లిలేని పిల్లవైనందుకు అట్లాంటి అత్తగారు... అట్లాంటి భర్త దొరకడం నీ నోముపంట" అంటుంటుంది.

ఇలా స్నేహితురాళ్ళు, వదినెల గుర్చి ఆలోచిస్తూ చాలాకాలం గడిపింది సుధ. బయట యెండ తీవ్రత, వడగాలి యెక్కువైనాయి. "ఎంతకూ ఈ వూరు రాదేం?" అనిపించింది.

"త్వరగా పోనీరా! ఇంకెంతదూరం ఉంది"

"దగ్గరకొచ్చినం గదమ్మా. మనూరు కనబడుతూనే ఉంది"

దూరంగా ఊరు కన్పిస్తోంది. ఒక్కసారి సుధ శరీరమంతా పులకించిపోయింది. మనస్సంతా ఆనందంతో ఉరకలు వేసింది. నరాల నిండా క్రొత్తరక్తం ప్రవహించింది. తన వూరి పొలిమేరల్లోకి అడుగు పెట్టినప్పుడల్లా మనస్సంతా అలా వెర్రి పారవశ్యంతో నిండిపోతుంది.

"ఇగో మీ చిన్నన్న పొలంగూడ వచ్చె" అన్నాడు కొమరయ్య.

"అరే! అప్పుడే చిన్నన్న పొలం వచ్చేసిందా" అని బయటకు చూసింది సుధ. ఇక్కడినుంచి అన్నీ వాళ్ళ పొలాలే. దూరంగా కన్పించే ఆ మామిడి గుంపులోనే వాళ్ళ మోటబావి. చిన్నప్పుడు ఎన్నోసార్లు మా మామిడి చెట్ల క్రింద పొద్దస్తమాలు యేవో ఆటలు ఆడుకొనేది తను – తన స్నేహితురాళ్ళతో.

"ఇగో ఇవి మీ పెద్దన్న పొలమేనాయె" అన్నాడు కొమరయ్య మళ్ళీ.

"తెలుసు లేరా! ఈ ఊరికి క్రొత్తగా వస్తున్నట్లు చెప్తున్నావు" అంది. సుధకు మళ్ళీ వాళ్ళన్నలు జ్ఞాపకం వచ్చారు.

"సరే కాని కొమురా! మా అన్నలు పోట్లాటలు యింకా ఎక్కువైనాయా?"

"చెప్పలేదమ్మ. ఈ మద్దె పంచాయతి బోర్డని పెద్ద లొల్లి పుట్టింది. ఓట్లట రెండు పార్టీలు గట్టింద్రు... పోటీ మీ పెద్దన్నకు రంగారెడ్డి దొరకు. రంగారెడ్డికెయ్యి మీ చిన్నన్న చేరిండు. ఆరంటే ఈరు ఈరంటే ఆరు మండిపడతాంద్రు... ఈ ఓట్లుపడే లోపల యెందరి తలకాయలెగిరిపోతయో"

ఒక్కసారి సుధ గుండెల్లో పిడుగు పడ్డట్లయింది. మనస్సు నిండా భయం ఆవరించింది. రంగారెడ్డిని గురించి ఆ ఊళ్ళో రకరకాల కథలు చెప్పుకుంటారు. ఆ

వూర్లో వాడు చేసిన దౌర్జన్యాలకు అంతులేదట. ఆ వూర్లో ఉన్న ప్రతి పేదింటి పడుచు వాడిపాలేనట. ఎప్పుడూ తాగుతూ ఉంటాడట. వాడికీ నాన్నకు ఎన్నాళ్ళనుంచో శత్రుత్వం అట. ఆ ఊర్లో వాన్ని కాస్త అణచివేయగల్గింది ఒక్క నాన్నేనట. చాలా రోజులుగా వాడు ఆ వూర్లో ఉండటంలేదట. యెక్కడో హైద్రాబాద్‌లో ఉంటాడట. వాడితో చిన్నన్న చేరాడా? చిన్నన్న యింతకు తెగించాడా? సుధ నిలువెల్లా కంపించిపోయింది. ఇది చిన్నన్నకు, పెద్దన్నకు పూర్వంలాటి మామూలు భూముల పంపకం లాంటి గొడవ కాదు. ఇది యెంత ఘోరానికైనా దారితీయవచ్చు. ఈ పాడువోట్లు ఎందుకు పెట్టారో... ఇట్లా అయినవాళ్ళ మధ్య పగలు, ద్వేషాలు రగిలించే పాడు ఓట్లు. ఈ పరిస్థితుల్లో తను ఈ ఊరు ఎందుకొస్తున్నట్లు? ఇంతసేపు తన ఊరు కన్పించినప్పుడు ఉదయించిన ఆ ఆనందమంతా ఆవిరైపోయింది. ఇప్పుడు భయం, అనుమానం, పొగమంచులాగా తన హృదయాన్ని అలుముకున్నాయి. ఇదంతా చూస్తూ నాన్నెలా ఉన్నారో?

బండి ఊర్లో ప్రవేశించింది. బజార్లలో ఉన్నవాళ్ళంతా తనకేసి ఆసక్తిగా చూస్తున్నారు. కొందరు "ఇదేనా రావడం" అనీ, "అందరు బాగున్నరా?" అని సుధను పలకరించారు.

ఊరి గోడలనిండా "రంగారెడ్డి దౌర్జన్యాలను అరికట్టాలి" "ఎన్నికల్లో రంగారెడ్డిని చిత్తుచిత్తుగా వోడించాలి", రాజేశాన్ని చిత్తుచిత్తుగా ఓడించాలి" "రాజేశం ముర్దాబాద్" అని మరోచోట – యిట్లా పెద్దపెద్ద అక్షరాలతో ఏమేమో రాసారు. "ఛీ! పాడు ఓట్లు" అని మళ్ళీ అనుకొంది సుధ. రాజేశం అంటే సుధ పెద్దన్న.

బండి యింటిముందు ఆగింది. ఇంట్లో అడుగుపెట్టటంతోటే చల్లని వాళ్ళ నాన్న పలకరింపుతో అన్నీ మరచిపోయింది సుధ. ఆ ఇంటిని రెండు భాగాలు చేశారు. ఒక భాగంలో వాళ్ళ పెద్దన్న, మరోభాగంలో చిన్నన్న ఉంటున్నారు. వాళ్ళ నాయిన కోసం ఒక గదిని కేటాయించారు. వాళ్ళ నాయిన కొన్నిరోజులు పెద్దన్న ఇంట్లోనూ, కొన్ని రోజులు చిన్నన్న ఇంట్లోనూ భోజనం చేసేలా ఏర్పాటు చేశారు. వాళ్ళ నాయిన ఎక్కడుంటే సుధ కూడా అక్కడే ఉండేది. ఆ ఇంటి రెండుభాగాలు ఆ ఇంటి వెనక కలిసే ఉంటాయి.

సుధ వచ్చి మూడు రోజులయింది. స్నేహితురాళ్ళందరినీ కలిసింది. పెద్దన్న, చిన్నన్న యిండ్లకు వెళ్ళొచ్చింది. వాళ్ళు ఓట్ల గొడవల్లో మునిగి ఉన్నారు. చిన్నన్న అసలు కనిపించనేలేదు. చిన్నొదినే చాలా బాధగా కన్పించింది. పూర్వపు ఉత్సాహమే లేదు. పెద్దొదిన కూడా అంతగా ఏమీ మాట్లాడలేదు. ఏమైనా తను ఎవరి విషయంలోను ఎట్లాంటి జోక్యం కల్పించుకోదల్చుకోలేదు.

ఊర్లో ఎక్కడ చూసినా గుంపులు గుంపులుగా ప్రజలు. యే యింట్లో చూసినా యేవో గుసగుసలు. తనకి తెలిసినప్పటి నుంచి ఈ వూర్లో యిట్లాంటి వాతావరణాన్ని చూసి ఎరగదు. నాన్న విషయమంతా చెప్పాడు. "చిన్నోడు పూర్తిగా చెడిపోయిండు. ఆ రంగారెడ్డిగాడు ఈ అన్నదమ్ములకు చాలా రోజులనుంచి పడటం లేదని తెలుసుకొని వాన్ని చేరదీసిండు. వాడు పట్నంనుంచి తెచ్చిన బీర్, బ్రాంది, విస్కీలు బాగా తాగిస్తున్నడట. వీడు వాటికి మరగి వానికి పూర్తిగా లొంగిపోయిండు. ఎలాగైనా ఈ ఊరికి సర్పంచయి బ్లాకు ప్రెసిడెంట్ అయి బ్లాకును చేజిక్కుంచుకోవాలని వాని ఉపాయం అట. తమ్మున్ని చేజిక్కించుకుంటే గాని అన్నను ఓడించటం సులభం కాదని తెలుసుకున్నడు. అంత నాశనమయ్యే రోజొచ్చింది. యేం చేస్తం" అన్నాడు.

"యేమోనాన్న... యిదంతా చూస్తోంటే నాకు చాలా భయంగా వుంది" అంది సుధ.

"నీకెందుకే భయం పిచ్చిదానా! నాలుగు రోజులుండి పోయేదానవు. నీ భర్త, నీ సంసారం. రాణిలాంటి బతుకు నీది. ఈ గాడిదలే కొట్టుకుచస్తరు. కండ్లల్ల ఉన్నట్టున్నవు. నాలుగు రోజులుండిపోతవని బండి తోలిన. నువ్వు యివేవి పట్టించుకోకు" అన్నాడు నారాయణ – సుధవాళ్ళ నాన్న.

సుధ ఆరోజు పోస్టు కోసం ఎదురుచూస్తోంది. అనుకున్నట్టుగానే సుధకు ఉత్తరం వచ్చింది. ఔను, తనకు తెలుసు, ఆయన తనను మరచి ఒక్కక్షణం గూడా బతకలేరని... అబ్బ! ఎంత పెద్ద ఉత్తరం. ఏమోమో రాసారు. ఒక గంట సేపు తనివితీరా ఆయనతో మాట్లాడినట్లనిపించింది. అప్పటికప్పుడే నాల్గుసార్లు చదువుకుంది. చదివినప్పుడల్లా కొత్తగా చదివినట్లే వుంది. చదివినప్పుడల్లా యే సుందర లోకాల్లోనో విహరిస్తున్నట్లుగా వుంది. నాలుగైదు రోజుల్లో వస్తారట... ఎప్పుడొస్తాయో ఆ నాలుగైదు రోజులు. వెంటనే వారికుత్తరం రాయాలి... అప్పుడే సాయంకాలమవుతోంది. త్వర త్వరగా పనులు ముగించుకొని ఆయనకు ఉత్తరం రాయాలి.

రాత్రి తొమ్మిదిగంటలౌతోంది. నాన్న యింకా రాలేదు. వచ్చేప్పుడు కవరు తెమ్మంది. మరచిపోడు కదా! తను యింత తొందరపడ్తున్నా నాన్న రావడం లేదు. వచ్చాక బాగా కోప్పడాలి.

నాన్న వచ్చాడు.... "ఏం నాన్నా... ఇంత ఆలస్యం చేసావు?" అంది కాస్త కోపంగా.

"ఏం లేదే! ఊరి పరిస్థితి రోజు రోజుకు అధ్వాన్నమయిపోతాంది. ఇంతకు ముందు 'పెద్దలొల్లి.. ఆ రెడ్డోని గడి ముందట్నించి మీ పెద్దన్న పార్టీ మనిషెవడో పోతాండట... అక్కన్నే బాగా తాగి ఆ రెడ్డి, మీ చిన్నన్న, వాళ్ళ గుంపు ఉన్నారట. "ఈ

గాడిద కొడుకును తన్నరా" అన్నాడట రెడ్డి. మీ చిన్నన్న వాన్ని పట్టుకొని గొడ్డును బాదినట్టు కొట్టిండట. అది ఇప్పుడే మీ పెద్దన్నోళ్ళకు తెలిసింది. మీ పెద్దన్న మండిపడతాండు"

"ఛీ! యిక్కడకు వచ్చినప్పటి నుండి యీ పాడు గొడవే. పోనీగాని త్వరగా అన్నం తినాలి నాన్న... నాకు చాలా పనుంది" అంది సుధ.

"యేం పనే? ఉత్తరం రాసుకోవటమేగా... అల్లుడు ఎప్పుడొస్తనన్నాడు"

"యేమో నాన్నా! నాకేం తెలుసు?" అంది సుధ. ఆమాట అంటున్నప్పుడామె బుగ్గలు ఎరుపెక్కాయి.

"ఇక్కడ నా బతుకు ఎట్లున్నా నిన్ను చూసుకునే బ్రతుకుతున్ననే... నీ కాపురమైనా హాయిగా ఉంది. నాకంతే చాలు. త్వరలోనే నీకో పండంటి కొడుకు పుడితే చూడాలని వుందే" అన్నాడు నారాయణ. సుధకు సిగ్గూ, కోపం రెండూ వచ్చాయి.

రాత్రి పదిగంటలవుతోంది. దూరంగా ఎక్కడో అదేపనిగా మొరుగుతున్న కుక్కల చప్పుడు తప్ప ఊరునంతా గంభీరమైన ప్రశాంతత ఆవరించింది. సుధ దీపం ముందు కూర్చొని, పెన్ను నోట్లో పెట్టుకొని ఆలోచిస్తోంది.

ప్రియమైన మీకు

ఇవాళనే మీ ఉత్తరం వచ్చింది. ఎన్నిసార్లు చదువుకున్నానో లెక్కలేదు. ఇక్కడికి వచ్చినప్పటి నుంచి ఎప్పుడూ మీరే జ్ఞాపకం వస్తున్నారు. ఎప్పుడొచ్చి మీ హృదయం మీద..."

ఇంతవరకు రాయడంతోటే ఆ నిశ్శబ్ద వాతావరణాన్ని ఛేదిస్తూ "నా మనిషిని కొడతడా? యివ్వాళ వాని రక్తాన్ని కళ్ళ చూస్త" అన్న పెద్దన్న కేకలు కర్కషంగా వినిపించాయి. సుధ ఒక్కసారి ఝుడుసుకుంది.

"నా రక్తాన్ని ఏపాటి జూస్తవో రారా" అన్న చిన్నన్న కేక ఆవెంటనే... సుధకు ఈరోజు రాత్రి వాళ్ళిద్దరి ప్రాణాలు పోతాయో అనిపించింది. "రారా? నువ్వో నేనో ఈ రోజుతో తెగిపోవాలె" ఇది పెద్దన్న కంఠం. సుధ ఇక నిలువలేకపోయింది. అప్పుడే నిద్రపోతున్న నాన్న "యేమిటే ఆ కేకలు" అని అడుగుతున్నాడు. " ఏముంది నాన్నా... చిన్నన్న, పెద్దన్న" అంటూ రాస్తున్న ఉత్తరాన్ని అలాగే చేతిలో పట్టుకొని యింటి వెనుకకు నడిచింది. "అక్కడకు నువ్వెందుకే" అన్న వాళ్ళ నాన్న మాటలు వినిపించుకోకుండా.

అక్కడి దృశ్యం సుధను పిచ్చిదాన్ని చేసింది. ఇద్దరి చేతుల్లోనూ లావుపాటి కర్రలు. ఇద్దరూ వెర్రి ద్వేషంతో ఊగిపోతున్నారు. బాగా కల్లు తాగినట్టున్నారు. క్షణంలో ఒకర్నొకరు సమీపించారు. ఇద్దరూ తాగుడు మైకంలో మైమరచి ఉన్నారు. కర్రలతో ఒకర్నొకరు కొట్టుకోవటం ప్రారంభించారు.

సుధ నరనరాల్లో యేదో వెర్రి ఆవేశం తెంచుకొని ప్రవహించింది. వాళ్ళనెలాగైనా ఆపాలనుకుంది. ఆ ఆవేశంలో సర్వమూ మరచిపోయింది. రెప్పపాటులో "అన్నా!" అంటూ వాళ్ళిద్దరి మధ్య సుధ... ఇద్దరి చేతుల్లో ఉన్న లావుపాటి కర్రలు సుధ తలమీద... సుధ తల పగిలిపోయింది. రక్తం వరదలు కట్టింది. సుధ నేలకొరిగింది. ఇద్దరన్నలూ గొల్లుమన్నారు. సుధ చేతిలో నలుగుతున్న సగం రాసిన ఉత్తరం ఆ రక్తపు మడుగులో కలిసిపోయింది.

"నా బిడ్డను చంపిం(ద్రు)గదరా" అంటూ నారాయణ సుధ శవంమీద పడిపోయాడు.

"అయ్యో సుధ... అయ్యో మామయ్యా!" అంటూ ఇంటిలోపలున్న వాళ్ళిద్దరి భార్యలొచ్చి గొల్లుమన్నారు.

*'జయశ్రీ' మాసపత్రిక (మే, 1970)*

*(నేపథ్యం: 1962లో ఎం.ఏ చదువుతున్న రోజుల్లో రాసిన కథ ఇది. మా కుటుంబంలో ఇలాంటి సంఘటన జరిగిందని మా మేనత్త ఒకామె చెబుతుండేది. చాలా భయంకరంగా ఇద్దరన్నలు కొట్లాడుకుంటోంటే వాళ్ళను ఆపడానికి వాళ్ళ చెల్లెలు వాళ్ళ మధ్యలో కెళ్ళిందని, వాళ్ళ చేతుల్లో ఉన్న కర్రలు ఆమె తలకు తగిలి ఆమె చనిపోయిందని, అలా చనిపోయిన ఆమె మా పెదనాయిన భార్య అనీ మామేనత్త నాకెన్నోసార్లు చెప్పింది. మొదట్లో ఈ సంఘటన ఆధారంగా ఒక నవల రాయాలనుకున్నాను. కొంతవరకు రాశాను కూడా. అది మధ్యలోనే ఆగిపోయింది. తర్వాత ఆ సంఘటన ఆధారంగా ఈ కథ రాశాను. ఆరోజుల్లో 'ఆంధ్రప్రభ' వారపత్రిక నిర్వహించే కథల పోటీకి ఈ కథను సంపించాను. మొదటి బహుమతో, రెండో బహుమతో తప్పకుండా వస్తుందనుకున్నాను. కానీ అలాంటిదేమీ జరుగలేదు. ఈ కథను రాసిన ఆరేళ్ళ తర్వాత ఈ కథ జయశ్రీ మాసపత్రికలో ప్రచురించబడింది.)*